

# ఈ కాలం రీ(నీ)తి

తోట నాగేశ్వరరావు

గుడివాడ బస్టాండ్ రద్దీగా వుంది. సమయం సాయంత్రం అయిదు గంటలు. లక్ష్మీపురం వెళ్ళడానికి ఆ రోజుకి ఆఖరు బస్సు ఆరు గంటలకు. అందుకే బస్సు రావడానికి ఇంకా గంటముందే బస్టాండులో ఆ ప్లాట్‌ఫామ్ మీద జనం జమకూడుతున్నారు. నారాయణ, ప్రకాష్ కూడా బస్సు కోసం నిలబడి వున్నారు. ఉన్నట్టుండి ప్రకాష్ ఫక్కున నవ్వాడు. నారాయణ అడిగాడు "ఎందుకని?" "ఆ కదలబోతున్న బస్సు మీద చూడు ఏం వ్రాసుందో?. 'ముసలివాళ్ళను, స్త్రీలను ముందుగా ఎక్కనీయండి' అంటూ! కాని, బస్సు ఎక్కలేక క్రింద నిలబడిపోయినవాళ్ళందరు వాళ్ళే.' మళ్ళీ నవ్వాడు ప్రకాష్. "దారుణం" గొణిగాడు నారాయణ. "దారుణం కాదు మై ఫ్రెండ్, ఈ కాలంలో అదే న్యాయం. అవకాశం జారవిడవడం అసమర్థుల లక్షణం."

వాళ్ళ బస్సు రానే వచ్చింది. ప్రకాష్ జనాన్ని తొక్కేస్తూ, దాదాపు వాళ్ళ మీద నుంచే బస్సులోకి ఎక్కేశాడు. నారాయణ ప్రక్కగా నిలబడిపోయాడు. కాస్సేపటికి మామూలుగానే ఆడవాళ్ళతో, ముసలి వాళ్ళతోపాటు నారాయణ క్రింద మిగిలిపోయాడు. ఫలితం వాళ్ళతోపాటు అతనికీ సీటు దొరకలేదు. కొన్ని సీట్లు ఖాళీగా వున్నా, వాటిలో చేతి రుమాళ్ళు, బ్యాగులు, కొండొకచో పక్కవాళ్ళ కాళ్ళు, చేతులు వున్నాయి. ఎవరూ ఇదేమని ప్రశ్నించడం లేదు. నారాయణ ప్రకాష్ కోసం చూశాడు. అతను ఒక సీటులో సెటిలయిపోయి, తన కోసం సీటు వుంచి చూస్తున్నాడు. దగ్గరకి వచ్చిన నారాయణని ఉద్దేశించి, "ఇది ఈ కాలం రీతి బ్రదర్. నువ్వు వాళ్ళెవరి కోసమో ఆగితే, చివరికి నీకు కూడా దిక్కులేకుండా పోయింది" ప్రకాష్ మాటల్లో వెక్కిరింత. నారాయణ తల వంచాడు.

* * *

మర్నాడు—

నారాయణ, ప్రకాష్ ఎదురుచూస్తున్న బస్సు రయ్యిన వచ్చి ఆగింది. నారాయణ దూసుకుంటూ గుంపులో జొరబడ్డాడు, అందరినీ తోసేస్తూ, తొక్కేస్తూ... ప్రకాష్ నివ్వెరపోయాడు. నారాయణ ఇంత త్వరగా బ్రతకనేరుస్తాడనుకోలేదు. ప్రకాష్ ఎక్కేటప్పటికే నారాయణ బస్సులో మూడు సీట్లు ఆపేసి కూర్చున్నాడు. ఎవరూ అతన్ని ప్రశ్నించడం లేదు. ఎప్పటిలాగానే ముసలివాళ్ళు, ఆడవాళ్ళు చివరకు ఎక్కుతున్నారు. ప్రకాష్ ఊహించని సంఘటన అప్పుడు జరిగింది. చివరగా ఎక్కుతున్న ముసలివాళ్ళకు తను ఆపిన సీట్లు ఆఫర్ చేసి, నారాయణ నిలబడ్డాడు నిటారుగా, తల ఎత్తుకుని. 'ఇది ఈ కాలం నీతి' అన్న భావం కన్పించింది ప్రకాష్‌కి నారాయణ మొహంలో. ●

## తదుపరి సీరియల్స్!

* జడలో జాబిలి

* పార్ట్ టైమ్ హజ్బెండ్

* నరనారాయణులు మరియు

* శైలకుమార్ "డ్రీమ్ గర్ల్"

## గవర్నర్లు ఉత్సవ విగ్రహాలే



రాష్ట్ర గవర్నర్ల అధికారాలు ఏపాటివో 40 సంవత్సరాల క్రిందట రాజాజీ పశ్చిమ బెంగాల్ గవర్నరుగా వున్నప్పుడు జరిగిన సంఘటన చూస్తే తెలుస్తుంది. ఒకసారి కొంతమంది సంఘసేవికలు తమ సంస్థ సహాయార్థం చేతి పనుల ప్రదర్శన ఏర్పాటు చేయదలచామని, అందుకుగాను గవర్నరు బంగళాలో కొంత భాగం కేటాయించవలసిందిగా కోరారు. అందుకు రాజాజీ "మీరు చేయదలచుకున్న పని మంచిదే, అయితే ఈ బంగళా నా స్వంతం కాదు. ప్రభుత్వానిదీ, "గవర్నరును అయినా ఈ భవంతి మీద నాకు ఏ మాత్రం అధికారం లేదు. ఈ భవంతిలో నేనొక ఉత్సవ విగ్రహాన్ని. అప్పుడప్పుడు ఈ విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా బజార్ల వెంట తిప్పి తిరిగి దాన్ని తీసుకువచ్చి ఈ భవంతిలో ప్రతిష్ఠిస్తూ వుంటారు. నేనేది చెయ్యదలచుకున్నా ముఖ్యమంత్రి ద్వారా మాత్రమే చేయవలసి వుంటుంది. ఏ పని స్వతంత్రించి చేయాలనుకున్నా ఏదో ఒక రూలు అడ్డు వస్తుంది. కాబట్టి మీరు ముఖ్యమంత్రిని కల్సుకోండి" అని వాళ్ళను పంపేశారట.

రాజాజీ గవర్నరుగా వున్నప్పుడే జరిగిన మరొక విషయం. రాజాజీ ప్రసిద్ధ శాస్త్రవేత్త శరత్‌చంద్రబోస్‌ను కలుసుకోవాలనుకున్నారు. శరత్ బోస్‌కు ఆహ్వానం పంపుతూ తోడ్కొని రమ్మని తన సెక్రటరీని పంపారు. కాని శరత్‌బాబు తన ఆరోగ్యం సరిగా వుండడం లేదని, పైగా ఈ వృద్ధాప్యంలో తాను బయటకు ఎక్కడకూ వెళ్ళడం లేదని చెప్పి సెక్రటరీని తిప్పి పంపగా, రాజాజీ "అయితే నేనే "కొండ" దగ్గరకు వెళ్ళాలి" అని మర్నాడే రాజాజీ శరత్‌బాబు ఇంటి ముందు గవర్నర్ ఆడంబరాలు, అట్టహాసాలు లేకుండా ప్రత్యక్షమయ్యారు. అనుకోకుండా హఠాత్తుగా వచ్చిన గవర్నర్‌ను చూడడంతోనే శరత్‌బోస్ ఆదరాబాదరా వచ్చి రాజాజీని కౌగలించుకున్నారు.

సేకరణ:

— వేమూరి జగపతిరావు